సాక్షి ఒడిశా

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 6,10,559

బంగారం: 6 గ్రాములు

వెండి: 16 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి

రాఖీ పౌర్ణమి ఆత్మీయంగా నిర్వహించారు. అధికారులకు కూడా రాఖీలు కట్టారు.

- 8లో



18 తాబేళ్లు స్వాధీనం

కలిమెల సమితిలో ఓ వ్యక్తి వద్ద 18 తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విక్రయిస్తుండగా పట్టుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

రాయగడ: సంతోషిమాత జయంతిని పురస్కరించుకుని స్థానిక హెడ్‌పోస్టాఫీస్ సమీపంలోని మందిరంలో అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మందిరం ప్రధాన అర్చకులు శ్రీపాద నటరాజ్ ఆధ్వర్యంలో దయం అమ్మవారికి అభిషేకాలు, షోడోపోచార పూజ, హోమ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఇదివరకు భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలను అలంకరించారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రముఖులకు బ్రహ్మాకుమారీల రక్షా బంధనం



బీఎస్‌ఎఫ్ జవాన్లకు రక్షా బంధనం చేసిన బ్రహ్మ కుమారీలు

భువనేశ్వర్: పవిత్ర రాఖీ పూర్ణిమ పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జట్నీ శాఖ రక్షా బంధనం కార్యక్రమం అత్యంత ఆనందోత్సాహాలతో నిర్వహించింది. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారి జ్యోతి ఆధ్వర్యంలో జట్నీ పరిసర ప్రాంతాల్లో మూడు వందల మందికి పైగా సోదరులకు రక్షాబంధనం చేశారు. వారిలో స్థానిక ఎమ్మెల్యే బిభూతి భూషణ్ బల్వంత్రాయ్, మున్సిపల్ మండలి (జేఎంసీ) అనంత్ బెహెరా, సరిహద్దు రక్షణ దళం (బీఎస్ఎఫ్) శిబిరంలో పలువురు జవాన్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



శమిష్ట

జయపురం: దేశ రాజధాని న్యూఢిల్లీ ఎర్రకోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి బెణగాం మహిళా శిశు విభాగ కేంద్రం సూపర్‌వైజర్ శమిష్టకు ఆహ్వానం అందింది. ఇది కొరాపుట్ జిల్లాకు గర్వించదగ్గ విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు.


కాంగ్రెస్ భవన్‌లో క్రాంతి దినోత్సవం



జాతిపితకు పుష్పాంజలి ఘటిస్తున్న ఓపీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్

భువనేశ్వర్: స్థానిక కాంగ్రెస్ భవన్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం క్రాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్టేట్ మ్యూజియం ఎదురుగా ఉన్న అమర వీరుల స్మృతి స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, తదితర నాయకులు కాంగ్రెస్ భవన్ ప్రాంగణంలోని జాతిపిత గాంధీ, తదితర ప్రముఖుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.

వలస కార్మికుని మృతి



చింటు మృతదేహం



చింటు మండంగి (ఫైల్)

రాయగడ: సదరు సమితి జిమిడిపేట పంచాయతీ పరిధిలోని టురిహంస గ్రామానికి చెందిన చింటు మండంగి (17) అనే వలస కార్మికుడు శనివారం మృతి చెందాడు. రెండు నెలల క్రితం ఉపాధి కోసం తోటి స్నేహితులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు వెళ్లి ఒక ప్రైవేట్ కంపెనీలో పనికి చేరాడు. రెండు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న చింటు యజమానికి డబ్బులు అడిగినా ఇవ్వకపోవడంతో స్వగ్రామానికి వెనుతిరిగాడు. ఇంట్లో ఉండి చికిత్స పొందుతున్నాడు. జ్వరంతో బాధపడుతున్న చింటు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో గ్రామస్తులు అతనిని సమీపంలోని జిమిడిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక



సంప్రదాయ అస్త్ర,శస్త్రాలను పట్టుకున్న యువతతో ఎమ్మెల్యే కద్రక తదితరులు

సంస్కృతి, సంప్రదాయాలను.. పరిరక్షించుకోవాలి

- ఆదివాసీ దినోత్సవంలో రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక

రాయగడ: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు అంతా సమైఖ్యతగా కృషి చేయాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం జరిగిన విశ్వ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భిన్న సంస్కృతుల మన రాష్ట్రంలో ఆదిమ తెగకు చెందిన ఆదివాసీలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అయితే ఆదివాసీల్లో ఇప్పటికీ అమాయకత్వం ఎత్తి పొడుస్తుందని విచారం వ్యక్తం చేశారు. అడవుల్లో, కొండకోనల్లో నివసించే ఆదివాసీలు అటవీ ఉత్పత్తులు సేకరించి వారి జీవనోపాధికి మార్గం సుగమం చేసుకుంటున్నారని అన్నారు. అయితే వారి ఆర్థిక, సామాజిక రంగాలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే చందంగా మారిందనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదని అన్నారు. ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నా అవిసక్రమంగా అమలు చేయకపోవడతోనే వారిలో అభివృద్ధి కానరావడం లేదని అన్నారు.



ఆదివాసీ యువతుల నృత్యాలు



సమావేశంలోపాల్గొన్న ఆదివాసీలు

సామాజిక చైతన్యం అవసరం

ఆదివాసీల్లో సామాజిక చైతన్యం ఎంతో అవసరమని అప్పలస్వామి కద్రక అన్నారు. తమ న్యాయమైన హక్కుల సాధనకు సమైఖ్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అటవీ, ఇళ్ల పట్టాలు వంటివి వారికి అందించాలని.. అందుకు ప్రభుత్వం చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీల సంఘీభావానికి ప్రతీకగా ఏటా నిర్వహిస్తున్న విశ్వ ఆదివాసీ దినోత్సవంలో యువత చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. భావితరాలకు వారు పునాదులు వేయాలని.. అదేవిధంగా ఆదివాసీల ఆచార, వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో వారి పాత్ర కీలకమన్నారు.

భారీ ర్యాలీ

ఆదివాసీల సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విధంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మహిళలు వారి సంప్రదాయ దుస్తులతో నృత్యాలు చేశారు. అదేవిధంగా అస్త్ర, శస్త్రాలు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఆదివాసీల కులదైవాలైన దిసారి పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర పువ్వల నేతృత్వంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, విశ్రాంత సబ్ కలెక్టర భోమ్‌సేన్ సాబొరొ, బీజేపీ నాయకుడు యాల్ల కొండబాబు, ఏడీఎం నవీన్ చంద్ర నాయక్ పాల్గొన్నారు. అనంతరం ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



సంప్రదాయ ఆదివాసీ దుస్తుల్లో యువతులు



ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీలు

మహిళా సాధికారత లక్ష్యంతో సుభద్ర పథకం: సీఎం



జయపురం: సుభద్ర పథకంలో మూడో విడత సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి



జయపురం: మాజీ మంత్రి హరిశ్చంద్ర బక్షీపాత్రో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి



జయపురం: సరస్వతీ శిశు మందిరంలో ముఖ్యమంత్రి మోహన్ మాఝికి రాఖీ కడుతున్న విద్యార్థిని



పర్లాకిమిడి: పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానం



పర్లాకిమిడి: డిబేటింగ్ ప్రథమ విజేత కరణం వైష్ణవికి బహుమతి ప్రధానం చేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



రాయగడ: సుభద్ర పథకం మూడో విడత ఆర్థిక సాయాన్ని అందిస్తున్న అధికారులు



మల్కన్‌గిరి: కలెక్టర్ సోమేశ్‌కు రాఖీ కడుతున్న సుభద్ర లబ్ధిదారు

జయపురం: మహిళల సాధికారిత, వారి ఆర్థిక ఉన్నతి ప్రధాన లక్ష్యంతో సుభద్ర పథకం అమలు చేస్తున్నామని సీఎం మోహన్‌చరణ్ మాఝి అన్నారు. సుభద్ర పథకం మూడో విడత ఆర్థిక సాయం కార్యక్రమం సందర్భంగా జయపురం రైల్వేస్టేషన్ సమీపంలోగల బంకబిజా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా లబ్ధిదారులకు ఆన్‌లైన్ ద్వారా సాయాన్ని అందజేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి, రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని, ప్రజల ఆకాంక్షలు తప్పకుండా నేరవేరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మోహన్ మఝి తన కొరాపుట్ జిల్లా పర్యటనలో శనివారం భువనేశ్వర్ నుంచి ఒక ప్రత్యేక విమానంలో జయపురం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి అరవిందనగర్ లోగల సరస్వతీ శిశు మందిర విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థినులు సీఎంకు రాఖీ కట్టారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి పొరాబెడ శ్రీరామనగర్ లో ప్రముఖ కార్మిక నేత మాజీ మంత్రి స్వర్గీయ హరిశ్చంద్ర బక్షీపాత్రో పార్క్‌లో బక్షీ పాత్రో విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం సభా ప్రాంతానికి చేరుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, మహిళా, శిశు సంక్షేమ,పర్యాటక వికాశ మంత్రి ప్రభాతి పొరిడ,చిన్న, మధ్యమ పరిశ్రమల మంత్రి గోకుల చంద్ర మల్లిక్, ఆదివాసీ, హరిజన, వెనుకబడ్డ వర్గాల సంక్షేమ విభాగ మంత్రి,నిత్యానంద పండ తదితరులు ఉన్నారు. సభలో స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, కొరాపుట్ కలెక్టర్ మనోజ్ సత్యభాన్ మహాజన్, జయపురం సబ్ కలెక్టర్ కుమారి అక్కవరం శొశ్యా రెడ్డి, జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కశ్యప్ తదితరులు పాల్గొన్నారు.

గజపతిలో...

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం రాఖీ పూర్ణిమ సందర్భంగా మహిళ ఖాతాల్లో సుభద్ర తృతీయ కిస్తీ రూ.5 వేలు డీబీటీ ద్వారా జమ చేసింది. కార్యక్రమాన్ని స్థానిక గజపతి స్టేడియంలో కలెక్టర్ మధుమిత, ఒడిషా మిషన్‌శక్తి, మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర రాఖీ పూర్ణిమ సందర్భంగా అర్హులైన మహిళలు మొత్తం ఒక లక్షా నలభై మూడువేల మందికి రూ.5 వేలు ఖాతాలో వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, డీఎఫ్‌ఓ కె.నాగరాజు, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి మనోరమా దేవి, సీడీఎంఓ డాక్టర్ ఎంఎం ఆలీ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రాయగడలో..

రాయగడ: స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో శనివారం సుభద్ర పథకంలో భాగంగా మూడో విడత ఆర్థిక సాయాన్ని జిల్లా యంత్రాంగం మహిళలకు పంపిణీ చేసింది. రాయగడ జిల్లా అదనపు మేజిస్ట్రేట్ నవీన్ చంద్ర నాయక్ స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ చంద్ర కాంత్ మాఝి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో గల సాంస్కృతిక భవనంలో శనివారం సుభద్ర యోజన మూడో విడతను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సమారీ టంగులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ సోమేష్ పాధ్యయాకు రాఖీ కట్టారు.

‘త్వరలో కార్పొరేషన్ తదితర సభ్యుల జాబితా’

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తొలి సారిగా ప్రభుత్వం ఏర్పాటు చేసి ఇటీవల ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఇంత వరకు పలు ప్రభుత్వ రంగ సంస్థలు, సంఘాలు వగైరా రంగాల్లో ప్రముఖులు, సభ్యుల నియామకం చేపట్టలేదు. ఏడాది పూర్తి పురస్కరించుకుని ఈ పదవుల భర్తీ చేపడతారని పార్టీ శ్రేణులు నిరీక్షిస్తున్నాయి. పలువురు ఆశావాహులు ఆయా సంస్థల్లో అధ్యక్షులు, పదవుల కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఈ సంస్థల నియామకాల వెంబడి మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ జరుగుతుందనే ఊహాగానాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఇంతలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్, గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి న్యూ ఢిల్లీ వెళ్లి పార్టీ కేంద్ర నాయకులు, కేంద్ర మంత్రులతో సమావేశమై తిరిగి వచ్చారు. ఇదే క్రమంలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ శని వారం న్యూ ఢిల్లీ నుంచి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పలు ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు. రాష్ట్ర మంత్రి మండలి సభ్యుల ప్రక్రియ కేంద్రంలో జరిగేది కాదు. రాష్ట్ర వ్యవహారం రాష్ట్రంలోనే జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి, తోటి మంత్రులు, రాష్ట్ర శాఖ పార్టీ ప్రముఖులతో సహజ సంప్రదింపులు జరిగిన మేరకు మంత్రి మండలి బాగోగులు ఖరారు చేయడం జరుగుతుందన్నారు. అతి త్వరలో ప్రభుత్వ రంగ సంస్థలు, సంఘాలు తదితర ఉన్నత స్థానాల్లో ప్రముఖుల నియామకం ఊపందుకుంటుందన్నారు. ఈ నెల మూడో వారంలో ఈ పనులు చురుగ్గా ముందుకు సాగుతాయి. అయితే నికరమైన తేదీ తదితర వివరాలు స్పష్టం కాలేదన్నారు. న్యూ ఢిల్లీ పర్యటన పురస్కరించుకుని పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఇతర నాయకులతో సమావేశం అయినట్లు రాష్ట్ర శాఖ బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు. సంస్థాగత వ్యవహారాలై ఈ సమావేశంలో లోతుగా చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో కార్పొరేషన్లు, బోర్డులు, కమిటీలకు అధ్యక్షులు, సభ్యుల జాబితా ప్రతిపాదనలు ఖరారైనట్లు స్పష్టమవుతుంది. మన్మోహన్ సామల్ ప్రకటన ప్రకారం ఈ నెలాఖరులోగా ఈ నియామకాలు పూర్తి చేసే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం అవతుంది. రాష్ట్ర శాఖ అధ్యక్షుని తాజా ప్రకటనతో ఆశావాహులు మరింత ఉత్సాహంతో శుభ ఘడియల కోసం ఆరాటపడుతున్నారు.

మరో యువతి అనుమానాస్పద మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో యువతుల అనుమానాస్పద మృతులు పెరుగుతున్నాయి. తాజాగా వెలుగు చూసిన సంఘటన సమాచారం ప్రకారం .. రాజధాని నగరం ఆస్పత్రిలో పని చేస్తున్న ఓ యువతి బాత్‌రూమ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తేలింది. స్థానిక చంద్రశేఖర్‌పూర్ ప్రాంతంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రి బాత్రూంలో శుక్రవారం ఒక నర్సు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తోటి సిబ్బంది, రోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. మృతురాలు గంజాం జిల్లాకు చెందిన సోనాలి రౌత్‌గా గుర్తించారు. ఆమె ఆస్పత్రిలో విధుల్లో ఉండగా ఈ విషాద సంఘటన చోటు చేసుకోవడంపై కుటుంబ సభ్యులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డ పూర్తి ఆరోగ్యవంతురాలని, ఎలాంటి అనారోగ్య, మానసిక ఇబ్బందులు లేవని. అకస్మాతుగా బాత్రూమ్‌లో పడి ప్రాణాలు కోల్పోవడం నమ్మలేకపోతున్నామని భోరుమంటున్నారు.

సమాచారం అందంతో స్థానిక చంద్రశేఖర్‌పూర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించారు. పరిసరాలు పరిశీలించిన మేరకు మృత దేహాన్ని స్వాధీన పరచుకుని శవ పరీక్షల కోసం తరలించారు. అనుమానాస్పద మరణంగా నమోదు చేసి కేసు దర్యాప్తు ప్రారంభించారు. శవ పరీక్షల నివేదిక అందిన మేరకు ఈ విషయమై నికరమైన స్పష్టత సాధ్యం అవుతుందని దర్యాప్తు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

విచారణకు కుటుంబం డిమాండ్

మృతురాలు సోనాలి రౌత్ తల్లితో సహా కుటుంబ సభ్యులు ఆమె ఆకస్మిక మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. ఆమె ఆరోగ్యంగా ఉందని, ఎలాంటి వైద్యపరమైన సమస్యలు లేవని తెలిపారు. ముఖ్యంగా ఆమె విధుల షిఫ్ట్ సమయంలో ఇలా జరగడం వెనక వాస్తవాస్తవాల్ని వెలుగులోకి తేవాలని దర్యాప్తు బృందానికి అభ్యర్థించారు. తన కూతురు మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌కి వెళ్లి జారిపడి స్పృహ కోల్పోయిందని ఆస్పత్రి వర్గాలు ఫోను ద్వారా సమాచారం అందజేయడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరినట్లు కుటుంబీకులు తెలిపారు. దర్యాప్తు బృందం ఆస్పత్రిలోని సిబ్బందిని ప్రశ్నిస్తు ఈ విచారకర సంఘటన పూర్వాపరాలకు సంబంధించి ప్రాథమిక సమాచారం సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో వైపు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు మరణమా, ఆరోగ్య సంబంధిత ఆకస్మిక మరణమా లేదా వ్యూహాత్మక దుశ్చర్యతో కూడినదా అనే సందేహాల కోణంలో దర్యాప్తు కొనసాగుతుందని అనుబంధ వర్గాల సమాచారం.

ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలపై ఆందోళన

భువనేశ్వర్: గిరిజన హక్కులు, వారసత్వం పరిరక్షణకు బిజూ జనతా దళ్ నిబద్ధతను పునరుద్ఘాటించింది. స్థానిక శంఖ భవన్‌లో శనివారం ప్రపంచ గిరిజన దినోత్సవం వేడుకగా నిర్వహించారు. పలువురు బీజేడీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో స్థానిక సమాజాల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలపై బీజేడీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర గిరిజన జనాభా జీవన విధానం, సంప్రదాయ భూములు, ఘనమైన సాంస్కృతిక వారసత్వం పరిరక్షణకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. బిజూ జనతా దళ్ స్వదేశీ సమాజాలకు అండగా నిలుస్తుందన్నారు. పర్యావరణం, సాంస్కృతిక సంప్రదాయాలు, జీవ వైవిధ్యం పరిరక్షించడంలో స్థానిక ప్రజలు కీలక పాత్రధారులుగా అభివర్ణించారు. గిరిజనులకు సభ్య సమాజంతో సమానమైన భవిష్యత్ ఆవిష్కరణకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల జీవన వైవిధ్యానికి భంగం కలిగించే చర్యలపై అవగాహన, సమష్టి ప్రతిస్పందన అవసరమని నాయకులు పిలుపునిచ్చారు.



శంఖ భవన్‌లో గిరిజన దినోత్సవ సంబరం



గిరిజన దినోత్సవంలో ప్రముఖుల్ని సత్కరించిన బీజేడీ ప్రముఖులు

క్లుప్తంగా

ముఖ్యమంత్రి గారూ.. మా గోడు వినండి



బ్యానర్ పట్టుకొని రోడ్డు పక్కన నిలుచున్న కార్మిక నేతలు

జయపురం: ముఖ్యమంత్రి మోహాణ మఝి జయపురం వచ్చిన సందర్భంగా సేవా పేపరు మిల్లు కార్మికులు తమ డిమాండ్లతో కూడిన బ్యానర్లు పట్టుకొని నినాదాలు చేశారు. ఒకే ఒక్క పరిశ్రమ సేవా పేపరు మిల్లును పూర్తి స్థాయిలో పని చేయించేదుకు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రామికులు, ఉద్యోగులు, కంట్రాక్ట్ కార్మికులు, విశ్రాంత శ్రామికులు, మృతి చెందిన శ్రామిక కుటుంబాలవారి గోడు విని, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రదీకరణ కార్యదర్శి సుజాత

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు శనివారం జిల్లా కోర్టు జయపురంలో ప్యానల్ న్యాయవాదులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ మహంతి పర్యవేక్షణంలో జయపురం ప్రదీకరణ కార్యాలయ సభా గృహంలో ప్యానల్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో కొరాపుట్ జిల్లాలో అన్ని తహసీల్ కార్యాలయాలలోనూ జిల్లా ప్యానల్ న్యాయవాదులు అందరూ పాల్గొన్నారు. శిక్షణ శిబిరాన్ని జిల్లా జడ్జి ప్రారంభించారు. ప్యానల్ న్యాయవాదుల శిక్షణ శిబిర లక్ష్యాలను న్యాయ సేవా ప్రదీకరణ జిల్లా కార్యదర్శి ప్రద్యోమయ సుజాత వివరించారు. శిబిరంలో సివిల్ కోర్టు రిజిస్ట్రార్ బిష్ణు ప్రసాద్ దేవత, శిక్షణ పరామర్శ దాతలు, న్యాయవాదులు హేమంత కుమార్ షాడంగి, ఎ.పి.పి అకమల్ శరీఫ్ పాల్గొని ప్యానల్ న్యాయవాదుల భూమిక, కార్యదక్షత, అధికారం, బాధ్యతలను వివరించారు.

వృద్ధుడు ఆత్మహత్య

నరసన్నపేట: ఉకలాంలో పిల్ల అప్పలనాయుడు (66) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడుర. అనారోగ్యంతో పాటు రెండు కాళ్లు పనిచేయక నడవలేకపోతుండటంతో మనస్తాపంతో వారం కింద ట చీమల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి మరణించాడు. కుమారుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలసేమియాతో బాలుడి మృతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన చిగురువలస రంజిత్ తలసేమి యా వ్యాధితో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. కొద్ది రోజులుగా విశాఖలోని ఓ ప్రైవే ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. గత ఏడాది పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన తమ కుమారుడు ఉన్నత స్థాయికి వెళతాడని ఆశించిన తల్లిదండ్రులు సింహాచలం, అనురాధకు తీరని వేదన మిగిలింది. రంజిత్ మృతి తో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సారవకోట: అంగూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాల పాలయ్యారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన ఎల్.శాంతారావు, సారవకోట మండలం గాతలపేటకు చెందిన లక్ష్మణరావులు ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలతో ఢీ కొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిరుపేదకు అండగా..



ఇంటిని కానుకగా ఇచ్చిన సంస్థ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: నందిగాం మండలం మర్లపాడుకు చెందిన నిరుపేద సందిపేట మహాలక్ష్మీకి పూండికి చెందిన స్ఫూర్తి సేవా సంస్థ అండగా నిలిచింది. ఇద్దరు ఆడపిల్లలతో నిలువ నీడ లేని ఆమెకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కెంగువ రాంబాబు, 25 మంది ప్రతినిధులు సహకారంతో రూ.3.70లక్షలు వెచ్చించి ఇంటిని నిర్మించారు. శనివారం గృహ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.గోవింద రావు, బి.మన్మధరావు, ఉత్తరాల బాలరాజు, సైని హేమారావు, యువతర సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, గున్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జయపురం: పట్టణంలో ప్రజలకు రాఖీలు కడుతున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్త



మల్కన్‌గిరి: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



జయపురం: ఒక వ్యక్తి చేతికి అక్కా చెల్లెళ్లు కట్టిన రాఖీలు



జయపురం: సోదరునికి రాఖీ కడుతున్న సోదరి



మల్కన్‌గిరి: బీఎస్ఎఫ్ జవాన్లకు రాఖీ కడుతున్న యువతి

ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



రాయగడ: జవాన్లకు రాఖీ కట్టిన విద్యార్థినులు



రాయగడ: బరంపురం ఎస్పీ శ్రవాణ వివేక్ ఎంకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



రాయగడ: సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని



జయపురం: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాఖీబంధన్ సమావేశం

రాఖీ పౌర్ణమి వేడుకలను సంప్రదాయబద్ధంగా శనివారం జరుపుకున్నారు. అన్నా, తమ్ముళ్ల క్షేమం కోరుతూ అక్కా, చెల్లెళ్లు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దూరప్రాంతంలో ఉన్నవారు సైతం అన్నతమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు వచ్చి అభిమానాన్ని చాటుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, కేజీబీవీల్లోని పిల్లలకు వివిధ సంస్థల ప్రతినిధులు రాఖీలు కట్టి సంప్రదాయాన్ని కొనసాగించారు. బీఎస్ఎఫ్ జవాన్లలు, అధికారులకు కూడా పిల్లలు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: పెద్దాస్పత్రిలో రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



రాయగడ: నవజీవన్ ట్రస్టు అనాథ ఆదివాసీ విద్యార్థినులు రాఖీ కడుతున్న దృశ్యం

ఉపాధ్యాయులతో బీఈఓ కార్యాలయం ముట్టడి



బీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయాన్ని సమితిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శనివారం ముట్టడించారు. తమకు వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సమితిలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు బీఈవో సుకాంత కర్తామీని చుట్టుముట్టి జీతాలు ఇప్పించాలని నిలదీశారు. తాను జిల్లా విద్యాధికారికి తెలియజేసి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని బీఈవో వారికి హామీ ఇవ్వడంతో శాంతించి ఆందోళనను విరమించారు. అనంతరం ఉపాధ్యాయులు మీడియాతో మాట్లాడుతూ.. బొయిపరిగుడ సమితిలో వివిధ పాఠశాలల్లో ఎక్స్ కేడర్ ఉపాధ్యాయులు 90 మంది పనిచేస్తున్నారని వెల్లడించారు. వారిలో నలుగురు గణశిక్షా ఉపాధ్యాయులని, ఆరుగురు జూనియర్ ఉపాధ్యాయులు కాగా సహాయక ఉపాధ్యాయులు 50 మంది, ఒక పీటీఐ, మిగతా వారు సాధారణ ఉపాధ్యాయులని వివరించారు. బ్లాక్ బీఈడీ కార్యాలయంలో ఏబీఈడీ పోస్టు ఖాళీగా ఉండటంతో తమకు జీతాలు చెల్లలించలేదన్నారు. అధికారులు తక్షణమే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

18 తాబేళ్లు స్వాధీనం

– ఒకరు అరెస్టు



ప్లాప్‌షెల్ తాబేలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు అటవీశాఖ సిబ్బంది సీలేరు నది వద్ద చేపలు పట్టే వ్యక్తి నుంచి 18 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎం.పి.వి 81 గ్రామానికి చెందిన మాన్‌సూన్ భీముడు అనే వ్యక్తి భారతీయ ప్లాప్‌షెల్ తాబేళ్లను నది నుంచి వేటాడి గ్రామంలో అమ్మకం కోసం తరలిస్తున్నాడు. మోటు వంతెన వద్ద మోటు అటవిశాఖ రేంజర్ మురళీధర్ అనూగులియా తన సిబ్బందితో పెట్రోలింగ్ కోసం వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వంతెనపై అతి వేగంగా వస్తున్న బైక్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులో తాబేళ్లను గుర్తించి నిందితున్ని అరేస్టు చేశారు. శనివారం కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఒక తాబేలు ఖరీదు వేలల్లో ఉంటుందన్నారు.



తాబేళ్లతో పట్టుబడిన నిందితుడు

12న బిజూ పట్నాయక్ విగ్రహావిష్కరణ

జయపురం: బీజేడీ పార్టీ శ్రేణులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మాజీ ముఖ్యమంత్రి, ఉత్కళ వరపుత్రుడు బిజూ పట్నాయక్ (బిజానంద పట్నాయక్) శిలా విగ్రహాన్ని ఈ నెల 12వ తేదీన ఆవిష్కరించనున్నారు. స్థానిక పాత బస్టాండ్, పట్టణ పోలీసు స్టేషన్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన బిజూ బాబు విగ్రహం ఏర్పాటు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. విగ్రహం చుట్టూ స్టీల్ రెయిలింగ్ పనులు జరుగుతాయని జయపురం మున్సిపాలిటీవర్గాలు తెలిపాయి. కొన్నేళ్ల నుంచి బిజూ పట్నాయక్ విగ్రహం మున్సిపాలిటీ కార్యాలయంలో పడి ఉంది. రాష్ట్రంలో ఒక మహోన్నత వ్యక్తి విగ్రహం ఎక్కడా స్థాపించకుండా మూలన పడేయటాన్ని బీజేడీ శ్రేణులే కాకుండా సాధారణ ప్రజలు కూడా విమర్శించారు. బీజేడీ శ్రేణులు, మాజీ మంత్రి, రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షులు రబినారాయణ నందో నేతృత్వంలో పలు ఆందోళనలు జరిపారు. అందుకు స్పందించిన మున్సిపల్ అధికారులు మూడు నెలల కిందట పట్టణ పోలీసు స్టేషన్, పాత ఓఎస్ఆర్‌టీ బస్టాండ్ మధ్య బిజూ పట్నాయక్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. తరువాత విగ్రహ సింహాసనం (విగ్రహం ప్రతిష్టించే దిమ్మ)ను, దాని చుట్టూ స్టీల్ రెయిలింగ్ మొదలగు పనులు చేసేందుకు నిర్ణయించారు. పనులను యుద్ధప్రాతిపదిన చేస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేసి ఈనెల 12వ తేదీన విగ్రహావిష్కరణ చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



విగ్రహ ఆవిష్కరణ పనులు జరుగుతున్న దృశ్యం

ఎన్నికల నిర్వహణలో అక్రమాలు: భక్త చరణ్ దాస్

భువనేశ్వర్: గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆరోపించారు. కర్ణాటక ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల లేవనెత్తిన వివాదాస్పద అంశాల పంథాలో ఒడిశాలో 2024 ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సందేహాల్ని సవాలుగా విసిరారు. 'గత ఎన్నికల్లో ఒడిశాలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య 42 లక్షల మంది ఓటర్లు ఎలా ఓటు వేయగలిగారు? 51 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న బిజూ జనతా దళ్ లోక్ సభలో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. కాంగ్రెస్ కేవలం 14 అసెంబ్లీ స్థానాలతో 1 లోక్‌సభ స్థానాన్ని గెలుచుకోగలిగింది.' ఇది అత్యంత దిగ్భ్రాంతికర పరిస్థితిగా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ఒక ప్రత్యేక ఐఏఎస్ అధికారికి ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయనపై అత్యంత గౌరవాభిమానాలు బాహాటంగా ప్రదర్శితం అవుతున్న పరిస్థితులకు కారణం ఏమిటని భక్త చరణ్ దాస్ బహిరంగ సవాల్‌ను సంధించారు. ఈ క్రమరాహిత్యాలు రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ యొక్క పారదర్శకత, న్యాయబద్ధత, సమగ్రత కోణాల్లో తీవ్రమైన సందేహాల్ని రగుల్చుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో సంక్షిప్తంగా స్పందించారు.

విశ్వవిద్యాలయాలు ప్రపంచ శ్రేణి పౌరులను తీర్చిదిద్దాలి: గవర్నర్



బరంపురం విశ్వ విద్యాలయం 26వ స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్‌తో ఇతర ప్రముఖులు

భువనేశ్వర్: విశ్వ విద్యాలయాలు నైతిక, సామాజికంగా బాధ్యతాయుతమైన, ప్రపంచ శ్రేణి సమర్థులైన పౌరులను కూడా రూపొందించడంలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు. బరంపురం విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవం, బరంపురం విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ (ఐజర్) పంచమ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. పట్టభద్రులు ఉద్యోగం, ఉపాధికి పరిమితం కాకుండా జ్ఞాన సరిహద్దుల విస్తరణలో వారధులుగా నిలిచి సృజనాత్మక ఆవిష్కరణలతో ఉజ్వల సమాజ నిర్మాతలుగా ఎదగాలని విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. సామాజిక దృక్పథంతో నైతిక ఆచరణతో జీవితాంతం అభ్యాసకులుగా కొనసాగాలని ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోని అగ్రగామి ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఆవిర్భవిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. స్వావలంబన సాధనతో మాత్రమే ఇది సాధ్యం అవుతుందన్నారు. ఈ ప్రయాణంలో విశ్వ విద్యాలయాలు డిగ్రీ ప్రదానం చేసే సంస్థలుగా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్య ఆధారిత అభ్యాసానికి శక్తివంతమైన కేంద్రాలుగా మారాలని తెలిపారు. కార్యక్రమంలో బరంపురం పార్లమెంట్ సభ్యులు ప్రదీప్ కుమార్ పాణిగ్రహి, అస్కా పార్లమెంటు సభ్యురాలు అనితా శుభదర్శిని, రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం మంత్రి సూర్యవంశీ సూరజ్, వైస్ ఛాన్సలర్ గీతాంజలి దాస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ డిగ్రీలను ప్రదానం చేశారు. ఈ గౌరవ డిగ్రీలను పొందిన వారిలో భారత దేశ క్షిపణి మహిళ డాక్టర్ టెస్సీ థామస్, ప్రముఖ అణు భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ అజిత్ కుమార్ మహంతి, 'మిల్లెట్స్ రాణి' రైమతి గివ్వురియా ఉన్నారు. 52 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ డిగ్రీలు, నలుగురు డి.లిట్ డిగ్రీలను పొందగా, 38 మంది విద్యార్థులు ఉత్తమ ఉత్తీర్ణతతో గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు.

వైభవంగా తిరువీధి

పర్లాకిమిడి: రాఖీపూర్ణిమ సందర్భంగా పట్టణంలో షిర్డీసాయి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో శనివారం తిరువీధి ఉత్సవం జరిపారు. మార్కెట్ జంక్షన్ వద్ద పండ్ల వ్యాపారి అప్పలరాజు ఆధ్వర్యంలో బాబాకు పూలదండలు వేశారు. పలువురు షిర్డీ సాయిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రేఖానా వీధి షిర్డీ సాయి మందిరం వద్ద అన్నప్రసాద వితరణ జరిగింది.



మార్కెట్ జంక్షన్‌లో షిర్డీసాయి తిరువీధి ఉత్సవం

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలోని శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 32 తెగలకు చెందిన ఆదివాసీలు మల్కన్‌గిరి బస్టాండ్ నుంచి భారీ ర్యాలీని డీఎన్‌కే క్రీడా మైదానం వరకు నిర్వహించారు. ఆదివాసీలు తమ సంప్రదాయ ఆయుధాల చేతుల్లో పట్టుకున్నారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నృత్యాలు, గీతాలాపాన చేశారు. జిల్లాలోని బోండా, కోయ, దిదాయి, శాంతాలి, గదభ, పరజా, తదితర తెగలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఆదివాసీ సంఘం నేతలు



సభలో పాల్గొన్న మహిళలు



కొమ్ము, డ్రమ్ నృత్యం ప్రదర్శిస్తున్న ఆదివాసీలు



ర్యాలీలో సంప్రదాయ ఆయుధాలతో ఆదివాసీలు



థింసా నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు



ఐజర్ స్నాతకోత్సవంలో ఉత్తీర్ణుల సమూహం



పరిశోధకులకు గౌరవ డాక్టరేటు ప్రదానం చేసిన గవర్నర్‌తో కేంద్ర మంత్రి



బరంపురం ఐజరత్ పంచమ స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రసంగం

క్లుప్తంగా

వట్టిగెడ్డ నీరు విడుదల



రావాడ వట్టిగెడ్డ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ నీటిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం విడుదల చేశారు. నీటిని విడుదల చేయడంతో వ్యవసాయ పంపుసెట్లు లేని రైతులు ఆనందిస్తున్నారు. ఉభాలు చాలా గ్రామాలలో ఇంకా ప్రారంభం కాకపోవడంతో ఆదివారం నుంచి ఉభాలు అవుతాయని రైతులు అంటున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, నీటి సంఘం అధ్యక్షులు ఎం.సత్యంనాయుడు, నాయకులు డొంకాడ రామకృష్ణ, జోగి భుజంగరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి టి.విమలారాణి శనివారం తెలిపారు. విద్యా, విజ్ఞానం, కళలు, ఆటలు ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు వారు తాము సాధించిన వాటికి సంబంధించిన సర్టిఫికెట్లు, పత్రికల్లో ప్రచురింపబడిన క్లిప్పింగ్‌లు తదితర వాటితో అవార్డ్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు చిక్కిన నిందితుడు!

కొత్తవలస : మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావును తన మేనకోడల భర్తయిన అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలస గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు ఈ నెల 5న నాటు తుపాకీతో కాల్చి చంపిన విషయం తెలిసిందే. కాగా నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు కశింకోట సమీపంలో పోలీసులకు శనివారం చిక్కినట్టు సమాచారం హత్య జరిగిన మరుసటి రోజు నుంచి అప్పారావు మకాం మార్చుతూ రాజమండ్రి, భద్రాచలం తదితర ప్రాంతాల్లో పోలీసుల నుంచి తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. నిందితుడు తన ఫోన్‌ను ఘటనా స్థలంలోనే వదిలేసి వెళ్లిపోయాడు. అయితే పాతవలస గ్రామంలోని తన ప్రియురాలికి నిందితుడు తరచూ ఫోన్ చేస్తుండడంతో ఆమె ఫోన్‌పై పోలీసులు నిఘా పెట్టారు. సంబంధిత సిగ్నల్ ఆధారంగా నిందితుడు కదలికలను పోలీసులు గుర్తించారు. చివరికి అనకాపల్లి జిల్లా కశింకోట సమీపంలో శనివారం ఉదయం టిఫిన్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఆదివారం కోర్టును హాజరు పర్చనున్నట్టు తెలిసింది.

మరణించి.. మరో ఇద్దరికి వెలుగునిచ్చి..



మరణించిన అచ్చియ్యమ్మ కళ్ళు తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి : అనారోగ్యంతో మరణించిన వృద్ధురాలి నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తాడివానిపాలెం అంబేడ్కర్‌కాలనీకి చెందిన రాజాన అచ్చియ్యమ్మ(90) ఆరోగ్యం క్షీణించి శనివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్, స్థానిక పెద్ద ఎం.సింహాచలం మృతురాలి కుటుంబ సభ్యులను నేత్రదానానికి ఒప్పించారు. కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో వెంటనే అక్కడకు చేరుకున్న ఎల్‌వీ ప్రసాద్ సారథ్యంలోని మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు అచ్చియ్యమ్మ నేత్రాలను సేకరించి సురక్షితంగా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పార్వతీశ్వరరావు

విజయనగరం క్రైమ్ : మండలంలోని జమ్ములో నివాసముంటున్న కొమ్మురు పార్వతీశ్వరరావు(32) తన ఇంట్లోనే బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ శనివారం తెలిపిన వివరాలు.. భోగాపురానికి చెందిన పార్వతీశ్వరరావు అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. జమ్ములో ఉంటున్న పార్వతీశ్వరరావు భార్య వద్దే రూ.14లక్షలు తీసుకున్నాడు. అడిగితే ఇదిగో.. అదిగో అంటూ దాట వేయసాగాడు. ఈసారి డబ్బులు అడిగితే చనిపోతానని బెదిరించేవాడు. అయినా మళ్లీ భార్య డబ్బులు అడగ్గా కోపంతో రగిలిపోయిన పార్వతీశ్వరరావు తన భార్య, తల్లిని గదిలో బంధించి బయట గడియపెట్టి బ్లేడ్‌తో మెడపై కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశు ఆరోగ్య సంచార వాహనాల్లో మందుల కొరత!

- మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్న వాహనాలు
- జిల్లాలో 13 సంచార పశు ఆరోగ్య వాహనాలు
- రోజుకు ఒకటి రెండు గ్రామాల్లోనే వైద్య శిబిరాలు
- గతంలో 1962 నంబరుకు ఫోన్ రాగానే సంబంధిత గ్రామానికి వెళ్లి సేవలు
- ఏవీ నాటి సేవలు నేడు...



గంట్యాడ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

విజయనగరం ఫోర్ట్: పశు ఆరోగ్య సంచార వాహనాలు అలంకార ప్రాయంగా గ్రామాలకు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువుల చికిత్సకు అవసరమైన మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్నట్టు తెలుస్తుంది. దీంతో పాడి రైతులు పశువుల వైద్యానికి ప్రైవేటు మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. గతానికి భిన్నంగా పశు సంచార ఆరోగ్య వాహనాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పశువుల వైద్యానికి సేవలు అందించేందుకు 1962 ట్రోల్‌ఫ్రీ నంబరును కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. నియోజకవర్గానికి రెండు వాహనాలు ఉంచారు. రెండు మండలాలకు ఒక వాహనం చొప్పన వైద్య సేవలు అందించేవారు. 1962 ట్రోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ రాగానే సంబంధిత గ్రామానికి వెళ్లి పశువులకు అవసరమైన వైద్యాన్ని వాహనం వద్దే అందించేవారు. శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తే దగ్గరలో ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాలకు తరలించి అక్కడ చికిత్స అందించి అనంతరం గ్రామానికి పంపించేవారు. విజయనగరం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు రెండు చొప్పన సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు 13 ఉన్నాయి.

వాహనాల వివరాలు

జిల్లాలో 4,75,805 పశువులు

జిల్లాలో 4,75,805 పాడి పశువులు ఉన్నాయి. ఇందులో 3,77,960 ఆవులు, 97,845 గేదెలు ఉన్నాయి. అదే విధంగా గొర్రెలు 4,48,154, మేకలు 1,56,511 ఉన్నాయి. పందులు 2,585, కోళ్లు 51,26,764 ఉన్నాయి.

గజపతినగరం నియోజకవర్గంలో – 2, చీపురుపల్లి నియోజకవర్గంలో – 2, బొబ్బిలిలో – 2, నెల్లిమర్లలో – 2, ఎస్.కోటలో – 2, విజయనగరంలో –1, రాజాంలో –2 చొప్పన పశు ఆరోగ్య సేవ వాహనాలు ఉన్నాయి.

మూగ జీవాలకు మందులు లేకుండానే..

మూగ జీవాల చికిత్స కోసం వచ్చిన సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్నాయని పాడి రైతులు అంటున్నారు. మందులు లేకుండా గ్రామాలకు వెళ్లడంతో రైతులు పశు వైద్యుడు చెప్పిన మందులు ప్రైవేటు మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దీంతో రైతులకు చేతి చమురు వదులుతుంది. సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను గతంలో జీవీకే సంస్థ అందించేంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత భవ్య హెల్త్ ప్రొవైడర్స్ సంస్థకు అప్పగించింది.

గతానికి భిన్నంగా..

సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల వివరాలను గతానికి భిన్నంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నెలకు 8 వేల నుంచి 9 వేల కిలోమీటర్ల వరకు ఒక్కో వాహనం సేవలు అందించేవి. ఇప్పుడు వాహనాలు నెలకు 3 వేల కిలోమీటర్లు కూడా తిరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా రోజుకు రెండు మూడు గ్రామాల్లో వాహనం పెట్టి సేవలు అందిస్తున్నారు. ఒకే చోట వాహనాలను పెట్టడం వల్ల ఎక్కువసార్లు కేసుల కోసం తిరగాల్సిన పని తప్పుతుంది. అంతేకాకుండా కొన్ని వాహనాలు గ్రామాలకు వెళ్లడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

మందులు వచ్చాయి..

సంచార పశువైద్యశాలల్లో మందుల కొరత ఉంది. అయితే ప్రస్తుతం మందులు వచ్చాయి. వాటిని సంచార పశు వైద్యశాలలకు అందజేస్తాం. ఇకపై ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ దామోదర్‌రావు,జిల్లా పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు

అధికారుల బదిలీలపై ఆగ్రహం



పీవో, సబ్‌కలెక్టర్ల బదిలీలు నిలుపుదల చేయాలని గిరిజన సంఘాల నిరసన ర్యాలీ

- సబ్ కలెక్టర్, పీవో బదిలీలను నిలుపుదల చేయాలి
- గిరిజన జేఏసీ నాయకుల డిమాండ్

గుమ్మలక్ష్మీపురం: పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ సిన్హా, పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీ వాస్తవకు చేపట్టిన బదిలీలను ప్రభుత్వం నిలుపుదల చేయాలని గిరిజన జేఏసీ నాయకులు కోలక లక్ష్మణమూర్తి, మండంగి రమణ, నిమ్మక సింహాచలం, బి.గౌరీశంకరరావు, బిడ్డిక పద్మ, తిరుపతిరావు, అడ్డాకుల చిన్నారావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు గుమ్మలక్ష్మీపురంలో వారి బదిలీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ కలెక్టర్‌గా యశ్వంత్ కుమార్ సిన్హా, పీవోగా అశుతోష్ శ్రీ వాస్తవ ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలోనూ, నిరుద్యోగ విద్యార్థుల ఉన్నత అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరిని బదిలీ చేయడం వలన ఇప్పటి వరకు గిరిజన గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం దీన్ని గుర్తించి వీరి బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని, లేకుంటే గిరిజనులంతా ఏకమై ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం



బాలికల గిరిజన నృత్యం



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ముఖ్య అతిథులు

విజయనగరం అర్బన్:

ఆదివాసీలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. గిరిజన పల్లెల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని, అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని, అప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజన కళలు, వారసత్వ సంపద, సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. గిరిజన నాయకులు తుమ్మ అప్పలరాజు, దుక్క సీతారాము, గేదెల లక్ష్మణరావు, నాగమణి, లక్ష్మీనారాయణ తదితరులు గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆదివాసీ ఉత్సవంలో విద్యార్థినులు గిరిజన నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద గెడ్డ కాలువలో మృతదేహం లభ్యం

పాచిపెంట: పెద్దగెడ్డ జలాశయం కాలువలో ఓ వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్టు పాచిపెంట ఎస్ఐ వెంకట్ సురేష్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు పట్టణంలో గలగొడ వీధికి చెందిన ముంజేటి నాగేంద్రబాబు (40) ప్లాస్టిక్ కవర్లు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. శనివారం కాలువలో శవమై కనిపించాడు. మృతునికి మద్యం అలవాటు ఉందని మద్యం మత్తులో బహిర్భూమి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భార్య ముంజేటి ఖరీస్మా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

12న మెగా జాబ్ మేళా

విజయనగరం అర్బన్:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో ఈ నెల 12న స్థానిక కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ కోర్సులలో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 16 బహుళ జాతి కంపెనీలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 'నైపుణ్యం.ఏపీ.జీఓవీఐఎన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, ఆ రోజు ఉదయం 9 గంటలకు కాలేజీ ప్రాంగణంలో హాజరుకావాలని సూచించారు.

కూల్ డ్రింక్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు



మాట్లాడుతున్న డాక్టర్ ఏవీ రాజశేఖర్

విజయనగరం గంటస్తంభం: కూల్ డ్రింక్స్ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, ఆరోగ్యానికి హాని కలిగించే కూల్‌డ్రింక్స్ విడిచిపెట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ముద్దని జనవిజ్ఞాన వేదిక జాతీయ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో శనివారం క్విట్ కూల్ డ్రింక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్‌లో కార్బన్‌డయాక్సైడ్, ఆల్కహాల్, ఎరువులు తదితర ప్రమాదకరమైన పదార్థాలు కలుపుతారని, ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో హాని కలిగిస్తాయని అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ.. కోకో కోల, పెప్సీ వంటి విదేశీ కూల్ కూల్ డ్రింక్స్‌ను విడిచిపెట్టి మన ఆరోగ్యాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మన ఇంటికి వచ్చే బంధువులకు కూల్ డ్రింక్స్‌ను ఇవ్వకుండా దాని స్థానంలో మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు వంటి పానీయాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, గురజాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద కేజీల గంజాయి పట్టివేత



గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- నలుగురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : ఒడిశా నుంచి తమిళనాడుకు వంద కేజీల గంజాయిని అక్రమంగా రవాణ చేస్తుండగా బొండపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. షిఫ్ట్ కారులో గంజాయిని తరలిస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ డీపీవోలు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొండపల్లి పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారంతో గొట్లాం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి షిఫ్ట్ కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరి నిందితుల్లో ఒకరైన ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి తాలూకా పుకలికి చెందిన మనోరంజన్ మిశ్రా(28)ని అదుపులో తీసుకున్నారు. మిశ్రా ఇచ్చిన సమాచారంతో మరో ముగ్గురు అనకాపల్లి జిల్లా పరవాడ మండలం దలాయిపాలెంకు చెందిన దలాయి రామరాజు, తగరపువలసలోని నిమ్మవానిపేట కాలనీకి చెందిన విరుమండి గోపి, తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా నర్దాంకు చెందిన పాండియం మాణిక్యంను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. మరో ఇద్దరు పియూష్ పడాలు, సుదర్శన్ భోరా పరారీలో ఉన్నట్టు చెప్పారు. కోరాపుట్ జిల్లాకు చెందిన మరోరంజన్ మిశ్రాతో కారులో గంజాయిని తరలించేందుకు రూ.20వేలు, కారును ఎంగేజ్ చేసినందుకు మరో రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. నిందితుల నుంచి 48 ప్యాకెట్లలో ఉన్న వంద కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన గజపతినగరం సీఐ జీఏవీ రమణ, బొండపల్లి ఎస్ఐ యు.మహేష్, పీఎస్ సాయిరాం పడాల్, కానిస్టేబుళ్లు టి.అప్పలనాయుడు, బి.రవికుమార్, కె.అప్పారావులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.



గంజాయితో పట్టుబడిన నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు

14కేజీల పట్టివేత

విజయనగరం క్రైమ్ : స్థానిక జీఆర్‌పీ రూ.లక్ష విలువ చేసే 14 కేజీల గంజాయిని శనివారం పట్టుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కే రావు, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐ బాలాజీరావు, రమణ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేస్తుండగా బరంపురం నుంచి చెన్నైకు గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా పటకొట్టాయికి చెందిన అరుణ్‌కుమార్, రాగుల్, అశోక్ మురుగన్‌లను పట్టుబడ్డారు. విచారించగా ఒడిశాలోని బరంపురం నుంచి చెన్నైకు తరలిస్తున్నట్టు వెల్లడైందన్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కేసు నమోదు చేసి విశాఖ రైల్వే కోర్టుకు తరలించామని జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

ఖరీఫ్‌కు గడ్డు కాలం..!



విజయనగరం మండలం పినవేమలిలో బీటలు వారిన వరి పొలం

పంటల సాగు విస్తీర్ణం హెక్టార్లలో...

పంట రకం	సాధారణం	సాగైనది
వరి	91,214	37,159
మొక్కజొన్న	12,386	9,724
రాగి	42	04
కంది	11	00
పెసర	66	04
మినుము	117	15
వేరుశనగ	369	46
నువ్వులు	5,585	3,917
పత్తి	2,142	1663
గోగు	306	15
చెరకు	4,720	2,278

- ముందుకుసాగని సాగు
- ఇప్పటివరకు సాగైనది 54,850 హెక్టార్లే..
- జిల్లాలో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,16,993 హెక్టార్లు
- మొఖం చాటేసిన వరుణుడు
- బీటలు వారుతున్న పొలాలు
- ఉభాలు జరిపిన రైతులకు ఎరువు కరువు

విజయనగరం ఫోర్ట్:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతన్నకు పంటల సాగు కలిసిరావడం లేదు. మొదట్లో చిరుజల్లులతో అదునుకాక మెట్ట భూముల్లో పంటల సాగు ఆలస్యమైంది. తర్వాత వరుణుడు మొఖం చాటేయడంతో మెట్ట భూముల్లో సాగుచేసిన పంటలు ఎండిపోయాయి. చెరువుల్లో నీరు చేరక వర్షాధార భూములు సాగుకు నోచుకోలేదు. వరినారు, వెద పొలాలు ఎండిపోతున్నాయి. ఒకప్పుడు ఆశ్లేషకార్తె వచ్చిందంటే వర్షాలు అనుకూలించేవి. చెరువులు, జలాశయాల్లో నీరు సమృద్ధిగా చేరేది. సాగుకు భరోసా ఉండేది. ప్రస్తుతం వరి సాగుకు అనువైన ఆశ్లేషకార్తె వచ్చి వారం రోజులు గడుస్తున్నా చాలా ప్రాంతాల్లో చినుకుజాడ కనిపించడంలేదు. ఉభాలతో కళకళలాడాల్సిన పొలాలు బంజరుభూములుగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పంటను తడిపేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కిలోమీటర్ల మేర పైపులు వేసి ఇంజిన్ల సాయంతో నీటిని తోడుతున్నారు.

వర్షమే ఆధారం...

జిల్లాలోని అధిక విస్తీర్ణంలో పంటల సాగుకు వర్షమే ఆధారం. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటలు పూర్తి స్థాయిలో సాగవ్వని పరిస్థితి. చెరువులు అంసపూర్తిగానే నిండాయి. మదుములు పారని దుస్థితి. జిల్లాలో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,16,993 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 54,850 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఆగస్టు 9వ తేదీ వచ్చినా పంటల సాగు ఊపందుకోకపోవడం రైతులను కలవరపెడుతోంది. ఈ ఏడాది ఉభాలు జరుగుతాయోలేదోనన్న బెంగ వెంటాడుతోంది.



గంట్యాడ మండలం పెదవేమలిలో సాగుకు నోచుకోని పంట పొలాలు

రైతులకు ఎరువు కూడా కరువే..

వరుణుడు కరుణించక రైతులు ఓ వైపు అవస్థలు పడుతుంటే... సాగునీటి ప్రాజెక్టుల కింద పంటల సాగు చేసిన రైతులు ఎరువు దొరకక ఇబ్బంది పడుతున్నారు. యూరియా దొరకక ఆందోళనలు చేస్తున్నారు. ప్రైవేటు డీలర్ల దగ్గర యూరియా ఉన్నా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మొఖం చాటేసిన వరుణుడు



గంట్యాడ మండలం మురపాకలో ఎండిన వరి పంట

గతకొద్ది రోజులుగా వరుణుడు మొఖం చాటేశాడు. వరి వెదలు పూర్తిగా ఎండిపోతున్నాయి. దమ్ముచేసి డ్రమ్‌సీడర్ విధానంలో జల్లిన వరి పొలాలు బీటలువారాయి. రైతన్న దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టుడుతున్నాడు. కళ్లముందే వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట ఎండిపోతుండడంతో ఆవేదన చెందుతున్నాడు. గంట్యాడ, విజయనగరం, సంతకవిటి, వంగర, బొండపల్లి, రాజాం, గజపతినగరం, దత్తిరాజేరు, జామి, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, ఎస్.కోట తదితర మండలాల్లో వర్షాధారంగా సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.